క్లుప్తంగా

శనేశ్వరాలయంలో పూజలు



నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): శనిగ్రహదోష పరిహారానికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు, కమిటీ సభ్యులు వీరోశేఖర్, ప్రభాకరాచారి, అర్చకులు శాంతికుమార్, ఉమామహేశ్వర్, భక్తులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన

తాడూరు: గతంలో ఎల్‌ఆర్‌ఎస్ ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం దరఖాస్తుదారుల వివరాలను శనివారం ఎంపీఓ బ్రహ్మచారి సేకరించే క్రమంలో మండలంలోని యాదిరెడ్డిపల్లి, చర్ల ఇటిక్యాల గ్రామాలను సందర్శించారు. దరఖాస్తులు చేసుకున్న వారు అందుకు సంబంధించిన వివరాలను గ్రామ పంచాయతీ కార్యదర్శికి అందజేయాలన్నారు. దరఖాస్తుదారులు ఎల్‌ఆర్‌ఎస్ పరిధిలో డాక్యుమెంట్ల వివరాలు తెలియజేయాలని అవగాహన కల్పించారు.

పెద్దకొత్తపల్లి: 2020లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ప్లాట్ల క్లియరెన్స్ కోసం పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరి సిబ్బందితో మండల కేంద్రంలో లే అవుట్లను పరిశీలించారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తులు చేసుకున్న ప్లాట్ల యజమానులు రశీదులతో సోమవారం గ్రామ పంచాయతీ వద్ద సంప్రదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రవీందర్, చంద్రయ్య, పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ బడ్జెట్ ప్రణాళిక తయారీపై శిక్షణ

ఉప్పునుంతల: 2025–26 ఆర్థిక సంవత్సరానికి జాతీయ ఉపాధి హామీ పథకం బడ్జెట్ ప్రణాళిక తయారు చేసే అంశంపై మండలంలోని ఈజీఎస్ ఏపీఓతో పాటు సిబ్బందికి ఈనెల 7న అచ్చంపేట ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ మోహన్‌లాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఈజీఎస్ ఏపీఓ, టీఏలు, ఈసీ, ఫీల్డ్ అసిస్టెంట్లు విధిగా శిక్షణకు హాజరు కావాలని ఎంపీడీఓ సూచించారు.

ఆర్టీసీలో ఖాళీ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా టీఎస్ ఆర్టీసీలో ఉన్న 3035 ఉద్యోగాలు ఖాళీలకు నోటిఫికేషన్ వేయాలని డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో శనివారం ఆర్డీఓ సురేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము భరత్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బొల్లం మహేష్, శివకుమార్, బహుగుణ నిరంజన్ పాల్గొన్నారు.

విద్యార్థినులపై వేధింపులు ఆపాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: విద్యార్థినులపై వేధింపులు ఆపాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ సంఘం నాయకులు మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో విద్యార్థినులను వేధిస్తున్న రికార్డు అసిస్టెంట్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని, ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పాల్గొన్నారు.

సూర్యప్రకాశ్‌ను సన్మానించిన కేటీఆర్

కల్వకుర్తిరూరల్: మండలంలోని కాటన్‌మిల్లు గుర్తింపు సంఘం యూనియన్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలపరిచిన సూర్యప్రకాశ్‌రావు ఐఎన్‌టీయూసీ అభ్యర్థి ఆనంద్‌కుమార్‌పై 68 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. శనివారం మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో కాటన్‌మిల్లు కార్మికులు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావులు సూర్యప్రకాశ్‌రావును అభినందించారు. మూడోసారి హ్యాట్రిక్ విజయం నమోదు చేయడంపై హర్షం వ్యక్తం చేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, నాయకులు గోవర్ధన్, విజయ్‌గౌడ్ ఉన్నారు.

కొనసాగుతున్న డిజిటల్ సర్వే

వెల్దండ: ప్రభుత్వ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న డిజిటల్ కుటుంబ సర్వే శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ వరకు కుటుంబ డిజిటల్ సర్వే నిర్వహిస్తామన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ మండలం కంటోనిపల్లి గ్రామాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రజలు అందుబాటులో ఉండి వారి కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ నెంబర్, ఫోన్ నెంబర్లను అందించాలన్నారు.

7న మంత్రి పర్యటన

కల్వకుర్తి: కల్వకుర్తి నియోజకవర్గంలో ఈనెల 7న రాష్ట్ర వ్యవసాయశాఖ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటించనున్నట్లు అధికారులు తెలిపారు. వెల్దండలో సోషల్ వెల్ఫేర్ పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ, కల్వకుర్తిలో చెక్కులను పంపిణీ, సీసీ పనులకు భూమి పూజ చేస్తారని తెలిపారు.



కల్వకుర్తిలో అన్నపూర్ణాదేవిగా వాసవిమాత



అచ్చంపేట పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో అమ్మవారికి పూజలు



వెల్గొండలో అమ్మవారికి పూజలు నిర్వహించిన ఉత్సవ కమిటీ సభ్యులు

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



తెలకపల్లిలో అన్నపూర్ణాదేవీగా దుర్గామాత

- దేవీ నవరాత్రుల్లో పాల్గొంటున్న భక్తులు
- మండపాల వద్ద ప్రత్యేక పూజలు, నైవేద్యాలు

సాక్షి, నెట్‌వర్క్: బిజినేపల్లి మండల కేంద్రం, పాలెం, నందివడ్డెమాన్, వెల్గొండ, వట్టెం గ్రామాల్లో దుర్గామాతను రోజుకో అలంకరణతో పూజిస్తున్నారు.

- అచ్చంపేట మండలంలో అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలు, మండపాల వద్ద అన్నదానం చేశారు.
- లింగాల మండల కేంద్రం, గ్రామాల్లో దుర్గామాత అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.
- కల్వకుర్తి పట్టణం, మండలంలోని పంజుగుల, మార్చాల, రఘుపతిపేట, తోటపల్లి, తాండ్ర గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.
- పెద్దకొత్తపల్లి మండల కేంద్రం, పెద్దకార్పాముల, దేవల్‌తిర్మలాపూర్‌లో దుర్గాదేవి లలితాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. అనంతరం 9మంది బాలికలను వాసవీమాతగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- దోమలపెంటలో తొమ్మిది రోజులు దుర్గామాత మండపం వద్ద అన్నదానం నిర్వహిస్తున్నారు.
- తెలకపల్లిలో అమ్మవారు అన్నపూర్ణాదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గౌరారం, రాంరెడ్డిపల్లి, గౌరెడ్డిపల్లి అమ్మవారికి పూజలు చేశారు.
- అమ్రాబాద్, పదర మండలాల్లో దుర్గాదేవిని అన్నపూర్ణాదేవి అవతారంలో పూజలు చేశారు. అమరేశ్వర ఆలయం వద్ద తీర్థ ప్రసాధాల వితరణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.
- కొల్లాపూర్ పట్టణంలోని వరిదేల శమీవృక్షం వద్ద దుర్గాదేవి లలితాదేవిగా అలంకరించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో గజలక్ష్మీదేవిగా అలంకరించి ఆర్యవైశ్యులు పూజలు చేశారు.
- ఉప్పునుంతల కేదారేశ్వరాలయం, లక్ష్మాపూర్, కాంసానిపల్లి, తాడూరు, గువ్వలోనిపల్లి, పెనిమిళ్ల, ఫిరట్వానిపల్లి, వెల్టూర్ గ్రామాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.



లింగాలలో అన్నపూర్ణాదేవి అలంకరణలో పూజలందుకుంటున్న దుర్గామాత



వెల్దండలో..



అమ్రాబాద్‌లో..



తాడూరులో..



దోమలపెంటలో..



కొల్లాపూర్ వరిదేలలో..



పెద్దకొత్తపల్లిలో..

బానిస బతుకుల విముక్తికి పోరాడుదాం



చెన్నారంలో బహుజన బతుకమ్మ ఎత్తి నినదిస్తున్న ప్రజా గాయకురాలు విమలక్క

బల్మూర్: బహుజనుల బానిస బతుకుల విముక్తి కోసం అందరం ఐక్యమత్యంగా పోరాడుదామని ప్రజా గాయకురాలు విమలక్క పిలుపు నిచ్చారు. బల్మూర్ మండలంలోని చెన్నారంలో శనివారం రాత్రి నిర్వహించిన బహుజన బతుకమ్మ వేడుకలో ఆమె పాల్గొని మహిళలతో ఆడి పాడారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతిని మహిళలను కాపాడు కోవడమే కోసం బహుజన బతుకమ్మ ద్వారా చైతన్య పర్చుతున్నామన్నారు. నిత్యం మహిళలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమైయ్యాయని, మహిళ హక్కుల కోసం అందరిని సంఘటితం చేసి పోరాటం సాగిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షులు కాశన్నయాదవ్, నాయకులు నారాయణ, మహిళ సంఘాల లీడర్లు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కళాశాలలో బతుకమ్మ వేడుకలు

వెల్దండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన బతుకమ్మలను తీసుకొచ్చి ఆటపాటలతో అలరించారు. అనంతరం సమీప చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గోపాల్‌రావు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలోని కూచకుళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అధ్యాపకులు, విద్యార్థులంతా కలిసి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కళాశాల అధ్యాకులు శ్రీధర్‌రెడ్డి, ఈశ్వర్ పాల్గొన్నారు.

కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, గాయత్రీ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాఠశాలను మండల కేంద్రానికి మార్చాలి

తాడూరు: మండల కేంద్రానికి మంజూరైన జ్యోతిరావుపూలే పాఠశాలను గతంలో సరైన వసతులు లేవన్న కారణంతో తెలకపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేశారని, ఆ పాఠశాలను తాడూరు మండల కేంద్రానికి మార్చాలంటూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కిరణ్మయికి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ మండల కేంద్రానికి మహాత్మా జ్యోతిరావుపూలే బాలికల పాఠశాల, వసతిగృహం గత ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అధికారులు స్పందించి తాడూరు మండలానికి యథావిధిగా పాఠశాలను తీసుకొచ్చేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసులు, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

చెంచులకు ఆధార్ కార్డులు

మన్ననూర్: చెంచులకు ఆధార్ కార్డు, పుట్టిన ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వారం రోజులుగా నల్లమల ప్రాంతంలోని అమ్రాబాద్, పదర, బల్మూర్, లింగాల మండలాల ఆదివాసి చెంచులకు ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేశారు. శనివారం మన్ననూర్‌లోని రైతు వేదిక, గిరిజన భవన్ ప్రాంగణాలలో అచ్చంపేట ఆర్డీఓ మాధవి ఆదేశాల మేరకు ఇద్దరు చొప్పున ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. భౌరాపూర్, మేడిమల్కల, సంఫిడి గుండాలు, ఈర్లపెంట, రాంపూర్, పుల్లాయిపల్లికి చెందిన 65 మందికి ఆధార్ కార్డులు అందజేయగా, 95 మందికి పుట్టిన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ సిబ్బంది పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా తాగునీటి సరఫరా

- మిషన్ భగీరథ డీఈఈ హేమలత



మాట్లాడుతున్న డీఈఈ హేమలత

ఉప్పునుంతల: గ్రామాల్లో ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా చేయడానికి కృషి చేస్తున్నామని అచ్చంపేట మిషన్ భగీరథ డీఈఈ హేమలత అన్నారు. శనివారం స్థానిక రైతు వేదికలో నాలుగు రోజుల నుంచి మండలంలోని గ్రామ తాగునీటి సహాయకుల (వాటర్ మెన్)కు వివిధ అంశాలపై ఇచ్చిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాటర్‌మెన్‌లకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. చేతి పంపుల మైనర్ రిపేర్లు, తాగునీటి అందించే బోరు మోటర్ల మైనర్ రిపేర్లు, వాటర్ ట్యాంకుల్లో బ్లీచింగ్‌తో క్లోరినేషన్ చేసుకోవడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం వాటర్‌మెన్‌లకు శిక్షణ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డీఈఈతో పాటు ఏఈ సాయికృష్ణ, ట్రైనర్ రమేష్, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన వాటర్‌మెన్‌లు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం



దోమలపెంట: జీసీసీ శాఖలో పని చేసి పదవీ విరమణ పొందిన పూరి శ్రీనివాసు దంపతులను శనివారం దోమలపెంట సీఐటీయూ నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీ.కిషన్, జగయ్య, మోహన్‌రెడ్డి, సిద్దార్థ, సుబ్బారెడ్డి ఉన్నారు.

రాజీలేని పోరాటం కొనసాగిస్తాం



తెలకపల్లిలో మాట్లాడుతున్న అంతటి కాశన్న

తెలకపల్లి: సామాజిక అసమానతలపై రాజీలేని పోరాటం చేస్తామని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో కేవీపీఎస్ 26వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ రుణాలు వెంటనే విడుదల చేయాలన్నారు. జీనుకుంట వద్ద ఉన్న లెదర్ పార్క్‌ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షులు కొంగరి కాశన్న, రమేశ్, అల్వాల భాస్కర్, వెంకటయ్య, సురేందర్‌కుమార్ పాల్గొన్నారు.

ఇరువర్గాల వివాదం

వెల్దండ: మండలంలోని చొక్కన్నపల్లికి చెందిన ఇదులపల్లి జంగయ్యకు చెందిన ఇటాచీ యంత్రాన్ని వనపర్తి జిల్లా, పాన్‌గల్ మండలానికి చెందిన కతాల్ లీజుకు తీసుకున్నాడు. కొంత కాలంగా లీజు డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితుడు కతాల్‌ను అడగంతో కులం పేరుతో దూషించినట్లు జంగయ్య వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కతాల్‌ను పిలిచి సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కతాల్ హైదరాబాద్ వెళ్తుండగా కడ్తాల్ చెక్‌పోస్టు వద్ద అతని వాహనాన్ని ధ్వంసం చేసి దాడి చేశారు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు వెల్దండలోని యెన్నమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాదు ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు



జిల్లా కేంద్రంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నాగర్‌కర్నూల్ క్రైం: మోటారు వాహన చట్టాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, పోలీసులకు వాహనదారులు సహకరించాలని సీఐ కనకయ్య గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడినవారికి, నిబంధనలు ఉల్లంఘించిన వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు గురికావద్దని, ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గోవర్ధన్, ట్రాఫిక్ ఎస్‌ఐ కల్యాణ్ పాల్గొన్నారు.



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2011–12 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు శనివారం మండల కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు.

హిందూ వాహినిని బలోపేతం చేయాలి

అచ్చంపేట రూరల్: హిందూ సమాజం బలోపేతమైతేనే దేశం సుభిక్షంగా, భద్రంగా ఉంటుందని మాతృశక్తి రాష్ట్ర అధ్యక్షురాలు సునీతా రామ్మోహన్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని అయ్యప్ప దేవాలయ ప్రాంగణంలో ప్రఖండ, మాతృశక్తి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

విప్లవ ఉద్యమాలకు ప్రతిబింబం గద్దర్

- ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కాశీం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీం

నాగర్‌కర్నూల్: ప్రజాకవి గద్దర్ మహాపురుషుడు అని భారతదేశ సాహిత్య సాంస్కృతిక రాజకీయ సామాజిక విప్లవ ఉద్యమాలకు ప్రతిబింబం గద్దర్ అని ప్రొఫెసర్ కాశీం అన్నారు. నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో సమావేశం హాల్లో ప్రముఖ రచయిత సామిడి జగన్ రెడ్డి రచించిన 'భారతదేశ ప్రజాకవి గద్దర్ 'పుస్తక పరిచయ సభ కవి సామాజిక ఉద్యమకారులు ఎదిరెపల్లి కాశన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ పుస్తకాలను పుస్తక కొనుగోలు దారులతో ప్రత్యేకంగా విష్కరించారు. ఈ సభలో పాల్గొన్న కాశీం మాట్లాడుతూ గద్దర్ జీవితాంతం తన రాజకీయ కార్యాచరణ వర్గసిద్ధాంతం తాత్విక చింతన కలిగిన గద్దర్ తన ఆట పాట ద్వారా ప్రజలకు చేరువయ్యేలా పాడి ఆడి చైతన్యం చేసి పీడిత ప్రజల సమస్యలకు పరిష్కార మార్గంగా కృషి చేశాడని అన్నారు. పుస్తక రచయిత జగన్‌రెడ్డి మాట్లాడుతూ తన రచించిన ఈ పుస్తకం పరిచయ సభ పెట్టిన నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదికకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ రాష్ట్ర నాయకులు జెట్టిధర్మరాజు, ఉపాధ్యాయ నాయకులు అబ్దుల్లా ఖాన్, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అచ్చంపేట అభివృద్ధికి అహర్నిషలు కృషి



పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: అచ్చంపేట అభివృద్ధికి అందరి సహకారంతో అహర్నిషలు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శనివారం అచ్చంపేటలో సుడిగాలి పర్యటన చేస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఉట్లకోనేరు శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎన్టీఆర్ మినీస్టేడియంలో సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీ, ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండోర్ బ్యాట్మింటన్ పోటీలు ప్రారంభించారు. టీఎన్‌జీఓ భవనంలో స్వాతంత్ర్య సమరయోధుడు, కేంద్ర మాజీ మంత్రి దివంగత గడ్డం వెంకటస్వామి జయంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు. వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో నిర్వహించిన నూతన పాలకవర్గం, ట్రేడర్స్ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. దసరా, బతుకమ్మ పండగల నిర్వహణపై కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల ప్రత్యేక సమావేశంలో పాల్గొని గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమాల్లో అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలి



పెద్దాపూర్‌లో వెన్నెలను సన్మానిస్తున్న గ్రామస్తులు

వెల్దండ: పేదల సంక్షేమానికి రాజ్యాంగం కల్పించిన హక్కులను సాధించుకోవడానికి ఐక్యంగా ఉండి పోరాటం చేయాలని ప్రజా గాయకుడు గద్దర్ కుమార్తె వెన్నెల పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి మున్ననూర్ గద్దర్ విగ్రహావిష్కరణకు వెళ్తున్న ఆమె మార్గమధ్యలో వెల్దండ మండలం పెద్దాపూర్‌లో కొదిసేపు ఆగి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమెను మహిళలు, నాయకులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

కోడేరు: మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీలో హైమాస్ట్ లైట్లు శనివారం మండల మాజీ కో ఆప్షన్ మెంబర్ అబ్దుల్ కరీం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైమాస్ట్ లైట్లు కావాలని మంత్రి జూపల్లి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, లైన్‌మెన్ ప్రభాకర్, చామంతి రాజు, మాజీ వార్డు సభ్యులు రాజు, మిద్దె రామకృష్ణ, జేసీబీ తిరుపతయ్య, గాజుల వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేడు టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సమావేశం

అచ్చంపేట రూరల్: జర్నలిస్టుల హక్కుల సాధన కోసం టీయూడబ్ల్యూజే(ఐజేయూ) పోరాటం చేస్తుందని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాములునాయక్ అన్నారు. ఆదివారం అచ్చంపేటలో నియోజకవర్గ స్థాయి టీయూడబ్ల్యూజే (ఐజేయూ) విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశానికి యూనియన్ సభ్యులు, హాజరు కావాలని కోరారు.

ఘనంగా కేంద్ర మాజీ మంత్రికి నివాళి



నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన, కమిషనర్ నరేష్‌బాబులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అబ్దుల్‌సలాం, సిబ్బంది పాల్గొన్నారు.

దోమలపెంట: ఈగలపెంటలోని శక్తిసదన్ వద్ద భూగర్భ కేంద్రం సీఈ.రామసుబ్బారెడ్డి, ఎస్‌ఈ.రవీంద్రకుమార్ గడ్డం వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతిని స్టేట్ ఫంక్షన్‌గా ప్రకటించడంతో నిర్వహించామన్నారు. డీఈ లు శ్రీధర్, మురళీధర్, గోపాల్, ఇంజినీర్లు ఉన్నారు.